సాక్షి
నాగర్‌కర్నూల్
శుక్రవారం : 30 : ఆగస్టు : 2024



కృష్ణమ్మ పరవళ్లు

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణానది పరవళ్లు తొక్కుతోంది.

వివరాలు 10లో ▸



నిర్లక్ష్యపు 'ముద్ర'

ప్రభుత్వం అందిస్తున్న ముద్ర రుణాలతో చేనేత కార్మికులకు మేలు చేకూరడం లేదు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.5 /21.3

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలని గురువారం సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గం పర్వతాలు అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలో ఎస్‌బీఐ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా రైతులకు ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీని కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 55 శాతం మంది రైతులకు రుణమాఫీ జరగలేదని ఆరోపించారు. రాష్ట్రంలో రైతుల రుణాలు రూ.31 వేల కోట్లు మాఫీ చేస్తామని చెప్పి.. బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు కేటాయించి.. కేవలం రూ.17,933 కోట్లతో సరిపెట్టారని దుయ్యబట్టారు. రూ.2 లక్షల పైన అప్పు ఉన్న రైతులకు ఇప్పటికీ మాఫీ చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా లీడ్ బ్యాంకు అధికారి, కలెక్టర్ వెంటనే కొత్త రుణాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. రైతుల మాఫీకి సంబంధించిన అర్హతలు ఉన్నా ఆధార్ కార్డులో, బ్యాంకు రుణ ఖాతాలో తప్పులు ఉన్నాయని సాకులు చూపించి రుణమాఫీ చేయడం లేదని విమర్శించారు. రుణమాఫీ అయ్యేంత వరకు దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాసులు, కందికొండ గీత, నాయకులు యాదయ్య, అశోక్, కాశన్న, సుభాష్, బాలరాజు, సురేష్, విజయ్‌గౌడ్ పాల్గొన్నారు.



నిలువు దోపిడీ..

ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లలో ఇష్టారాజ్యం



- వ్యాధి నిర్ధారణ పరీక్షల పేరుతో దందా
- మామూలు జ్వరంతో వెళ్లినా తప్పని టెస్టులు
- కొరవడిన వైద్య శాఖ అధికారుల పర్యవేక్షణ
- నిరుపేద రోగులతో ముక్కుపిండి వసూలు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలోని పలు ప్రైవేటు ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల పేరుతో అక్రమ దందాకు తెర లేపారు. సీజనల్ వ్యాధులతోపాటు జ్వరం, జలుబు, దగ్గు ఇతర అనారోగ్య సమస్యలతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే రోగులను నిలువు దోపిడీ చేస్తున్నారు. అవసరం ఉన్నా.. లేకున్నా టెస్టులు చేస్తూ రోగులతో అందిన కాడికి దోచుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మామూలు జ్వరంతో ఆస్పత్రికి వెళ్లినా టెస్టులు తప్పడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. వైద్యులు లేని సమయంలో ఎవరైనా వైద్యం కోసం వస్తే ఫోన్‌లో సూచనలు చేస్తూ కిందిస్థాయి సిబ్బందితో చికిత్స చేయిస్తున్నారు. కిందిస్థాయి సిబ్బంది వచ్చీరాని వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో నిర్లక్ష్యపు వైద్యంతో పలువురు రోగులు మృతిచెందిన ఘటనలు ఉన్నాయి.

పర్యవేక్షణ కరువు..

జిల్లాలోని అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్‌లోని ప్రైవేటు ఆస్పత్రులు, ఆర్‌ఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్‌లలో గతంలో అధికారులు తనిఖీలు నిర్వహించకుండా చూసీచూడనట్లు వ్యవహరించడంతో రోగుల ప్రాణాలు గాల్లో కలిసిపోవడంతోపాటు నగదు దోపిడీకి గురయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు. నూతనంగా వచ్చిన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులతోపాటు డయాగ్నోస్టిక్ సెంటర్లలో తరుచుగా తనిఖీలు నిర్వహిస్తూ రోగుల ప్రాణాల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అలాగే స్థాయికి మించి వైద్యం అందించే ఆర్‌ఎంపీ పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సమాచారం ఇవ్వండి..



ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లలో తరుచుగా తనిఖీలు నిర్వహిస్తాం. రోగులకు అవసరం లేని చికిత్సలతోపాటు టెస్టులు నిర్వహిస్తే జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం అందించాలి.

– స్వరాజ్యలక్ష్మి, డీఎంహెచ్‌ఓ

స్కానింగ్ సెంటర్లపై నిఘా ఏది?

జిల్లాలోని ఆయా ఆస్పత్రుల్లో ఉన్న స్కానింగ్ సెంటర్లతోపాటు ప్రైవేటు స్కానింగ్ సెంటర్లలో చాలా ఏళ్లుగా లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొద్దిరోజుల క్రితం జిల్లాకేంద్రంలో హౌజింగ్‌బోర్డు కాలనీలో ఉన్న ఓ ఆర్‌ఎంపీ క్లినిక్‌లో గర్భిణికి అబార్షన్ చేస్తున్న క్రమంలో రక్తస్రావం ఎక్కువ కావడంతో జనరల్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా విషయం వెలుగులోకి వచ్చింది. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఆర్‌ఎంపీ క్లినిక్‌ను తనిఖీ చేయడంతో కొన్ని స్కానింగ్ సెంటర్ల రిపోర్టులు అక్కడ దొరకడమే లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయనడానికి నిదర్శనం.

'స్థానిక' ఎన్నికల నిర్వహణపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్, పక్కన అదనపు కలెక్టర్ సీతారామారావు తదితరులు

నాగర్‌కర్నూల్: పంచాయతీరాజ్ చట్టం–2018తో పాటు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిబంధనలపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సిబ్బందిని సంసిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి గురువారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జెడ్పీసీఈఓలు, డీపీఓలు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీసీ నిర్వహించి సూచనలు చేశారు. వీసీ అనంతరం కలెక్టర్ స్థానిక అధికారులతో మాట్లాడుతూ ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ వంటి ప్రక్రియలను తక్షణమే చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. సెప్టెంబర్ 6న ఓటరు జాబితా డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వెలువరించి అభ్యంతరాలు స్వీకరించాలని, 21న తుది ఓటరు జాబితాను వెలువరించాలని చెప్పారు. తుది జాబితాకు ముందే క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, ఏవైనా మార్పులు, చేర్పులకు అభ్యర్థనలు వస్తే వాటిని పరిశీలించాలని సూచించారు. ఏ చిన్న పొరపాటుకు ఆస్కారం లేకుండా ప్రతి దశలోనూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సామగ్రిని సమకూర్చుకోవాలని, ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన పోలింగ్ సిబ్బందిని గుర్తించి, వారికి శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని, ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో విధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిపించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి నూతన ఓటరు జాబితాపై చర్చించారు. నూతన ఓటర్ జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఆయా సమావేశాల్లో అదనపు కలెక్టర్లు దేవసహాయం, సీతారామారావు, డీపీఓ రాంమోహన్‌రావు, డిప్యూటీ సీఈఓ గోపాల్‌నాయక్, అచ్చంపేట ఆర్డీఓ మాధవి, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ జాకీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు

మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నియంత్రణకు కలసికట్టుగా పనిచేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, రవాణా తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో వెంటనే యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాకేంద్రంలోని డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల నియంత్రణపై ఎస్పీతో కలిసి అవగాహన సమావేశం నిర్వహిస్తామన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల రవాణా, వినియోగం, వాటితో ముడిపడిన కార్యకలాపాలను గమనిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసులు, డీఈఓ గోవిందరాజులు, సోషల్ వెల్ఫేర్ అధికారి రాంలాల్, వైద్య, ఆరోగ్యశాఖ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

'విమర్శలపై ఆత్మ పరిశీలన చేసుకోవాలి'



ఉప్పునుంతలలో రెడ్డి సేవా సమితి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ మల్లురవి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట/ఉప్పునుంతల: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మేరకు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తోందని ఎంపీ మల్లు రవి అన్నారు. గురువారం అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు అన్యాయం జరిగిందని గగ్గోలు పెట్టే మాజీ మంత్రి కేటీఆర్, హరీశ్‌రావులు వారి హయాంలో చేసిన రుణమాఫీకి, ఇప్పుడు చేసిన రుణమాఫీపై బేరీజు వేసుకుని ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15 నాటికి రుణమాఫీ చేశారని, సాంకేతిక లోపంతో మాఫీ రాని వారి కోసం ప్రభుత్వం ఇంటింటికి వ్యవసాయ అధికారులను పంపించి లిస్టు తయారు చేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒకటి తప్ప అన్నింటిన్ని అమలు చేశామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు కళ్లు పెట్టి చూస్తే మేము ఇచ్చే పథకాలు ప్రజలకు చేరుతున్నాయో.. లేదో తెలుస్తుందన్నారు. అంతకు ముందు ఉప్పునుంతలలో నూతనంగా నిర్మించిన రెడ్డి సేవా సమితి భవనాన్ని ఎంపీ మల్లురవి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే వంశీకృష్ణ కలిసి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో టైకార్డు చైర్మన్ బెల్లయ్యనాయక్, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, రెడ్డి సేవా సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, నాయకులు లింగారెడ్డి, రామకృష్ణారెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

2న కలెక్టరేట్ ఎదుట ధర్నా

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న తెలిపారు. గురువారం జిల్లాకేంద్రంలోని హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. బడుగు, బలహీన వర్గాల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఆరోపించారు. ఆరు నెలలుగా విద్యార్థులకు పాకెట్ మనీ ఇవ్వడం లేదని, ట్యూషన్ లెక్చరర్‌ను నియమించలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థుల సమ్యలు పరిష్కరించాలని సూచించారు.

కూల్చివేతల ప్రకంపనలు

- పాలమూరులో హైడ్రా తరహాలో అక్రమ నిర్మాణాల కూల్చివేత
- రాజకీయంగా దుమారం రేపిన ఘటన



అక్రమ నిర్మాణం కూల్చివేస్తున్న సిబ్బంది

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: పాలమూరులో హైడ్రా తరహాలో చోటుచేసుకున్న కూల్చివేతలు ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. దశాబ్దాల తరబడి ఆక్రమణల పర్వం కొనసాగిన క్రమంలో క్రిస్టియన్‌పల్లి రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 523 వివాదాలకు కేంద్రంగా మారిన విషయం తెలిసిందే. ఆదర్శనగర్‌లో సర్కారు భూమి అన్యాక్రాంతంపై ఫిర్యాదులు, ఆరోపణల వెల్లువతో ఎట్టకేలకు దృష్టి సారించిన అధికార యంత్రాంగం గుట్టుచప్పుడు కాకుండా అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించి.. ఏకంగా 78 ఇళ్లను నేలమట్టం చేయడం సంచలనం రేపింది. ఇదే క్రమంలో బోగస్ పట్టాలు సృష్టికర్తలు.. ఆక్రమణదారులు.. సహకరించిన వారు ఎవరు అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతుండగా.. జిల్లావ్యాప్తంగా చర్చ జోరుగా సాగుతోంది.

సామాన్యులకు తప్పని ఇబ్బంది..

సర్వే నం.523లో 1998 నుంచి 2001 వరకు దశల వారీగా అప్పటి ప్రభుత్వాలు పేదల ఇళ్ల కోసం 60, 75 గజాల చొప్పున స్థలాలు కేటాయించింది. ఇందులో దివ్యాంగులతోపాటు ఇతర నిరుపేదలున్నారు. అయితే 2018లో ప్రభుత్వం రీ సర్వే చేసింది. ఇందులో సుమారు 800 పైచిలుకు అర్హులు ఉన్నట్లు తేల్చింది. వీరికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని.. అధికారులు పట్టాలు స్వాధీనం చేసుకున్నారు. కానీ.. చాలామందికి ఇళ్లు రాలేదు. ఈ క్రమంలో ప్రభుత్వ స్థలంపై అక్రమార్కులు కన్నేసి.. బోగస్ పట్టాలు సృష్టించారు. ఇవేమీ గ్రహించని సామాన్యులు ఆశతో డబ్బులు ముట్టజెప్పి.. ఇళ్లు నిర్మించుకున్నారు. ప్రస్తుతం కూల్చివేతల నేపథ్యంలో అధికారులు ఇన్నాళ్లు ఏం చేశారు.. ఇళ్లు నిర్మించుకున్న తర్వాత కూల్చివేయడం పట్ల ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు. ఈ క్రమంలో ఎవరెవరు ఎంత తీసుకున్నారు.. ఎవరు స్థలం చూపించి కట్టుకోమన్నారు వంటి నిజాలు వెలుగులోకి వస్తున్నాయి.

రాజకీయ దుమారం..

సర్వే నంబర్ 523లో గురువారం తెల్లవారుజామున జరిగిన కూల్చివేతలు రాజకీయంగా దుమారం రేపాయి. అక్రమాలకు పాల్పడిన వారిలో ఓ ప్రజాప్రతినిధి భర్త ఇటీవల అధికార పార్టీలో చేరారు. ఈ క్రమంలో కూల్చివేతల జరగడంపై రెండు రాజకీయ పార్టీలకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో పోటాపోటీ విమర్శలు హాట్‌టాపిక్‌గా మారాయి.

అక్రమార్కులను వదలం..

ఆదర్శనగర్ కాలనీలో జరిగిన అక్రమాల్లో బాధ్యులను ఎవరినీ వదలం. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి.. అక్రమ నిర్మాణాలని తేలాకే పోలీస్, మున్సిపల్ శాఖల సహకారంతో అక్రమంగా నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేశాం. ప్రస్తుతం ఉన్న ఇళ్లలోనూ కొన్ని బోగస్ పట్టాలున్నాయి. వాటిపైనా విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

– ఘన్సీరాం, తహసీల్దార్, మహబూబ్‌నగర్ అర్బన్

అతివేగం.. అజాగ్రత్త!



సంఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపడుతున్న పోలీసులు, హైవే సిబ్బంది

- 44వ నంబర్ జాతీయ రహదారిపై వరుస ప్రమాదాలు
- తాజాగా అన్నాసాగర్ – పోల్కంపల్లి సమీపంలో డీసీఎంను ఢీకొట్టిన కారు
- నలుగురు మృతి.. మరో ముగ్గురికి తీవ్రగాయాలు

మహబూబ్‌నగర్ క్రైం/ భూత్పూర్: జాతీయ రహదారి–44పై ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. అతివేగం, అజాగ్రత్త, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల విలువైన ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. తాజాగా గురువారం భూత్పూర్ మండలం అన్నాసాగర్–పోల్కంపల్లి సమీపంలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో నలుగురు మృత్యువాత పడగా.. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఒకరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కాగా.. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఉండడంతో వారి బంధువులు, స్నేహితులు పాలమూరు జనరల్ ఆస్పత్రికి తరలివచ్చి కన్నీటి పర్యంతమయ్యారు. దీంతో ఆస్పత్రి ప్రాంగణం ఆర్తనాదాలతో మార్మోగింది. మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, భూత్పూర్ సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ చంద్రశేఖర్‌లు పంచనామా పూర్తి చేసి మృతదేహాలకు పోస్టుమార్టం అయిన తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు. అంతకు ముందు ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న భూత్పూర్ సీఐ రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణాలపై ఎస్‌ఐ చంద్రశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు.

మరమ్మతు కోసం ఆగిన డీసీఎం

కొత్తకోట నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం బుధవారం రాత్రి మరమ్మతు కోసం పోల్కంపల్లి స్టేజీ సమీపంలో జాతీయ రహదారిపై ఆగింది. ఎలాంటి సూచికల బోర్డు లేకపోవడంతో ప్రమాదం చోటుచేసుకొంది. అయితే జాతీయ రహదారిపై ఉదయం వేళలలో లారీలు, డీసీఎంలు, ట్రక్కులు రోడ్డు పక్కనే పార్కింగ్ చేసి డ్రైవర్లు కాలకృత్యాలు తీర్చుకోవడంతోపాటు నిద్రపోవడం జరుగుతుంది. ఈ క్రమంలో వాహనాల పక్కన స్టాఫర్స్ పెట్టుకోకపోవడం, ఇతర జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల వెనుక నుంచి వస్తున్న వాహనాలు అతివేగం కారణంగా అదుపు తప్పి ఢీకొట్టుకోవడం జరుగుతుంది. గతంలో కూడా ఇలాంటి ఘటనలు అనేకం జరిగినా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలకు అడ్డుకట్ట పడటం లేదు.

కాగా.. జాతీయ రహదారిపై ఎలాంటి సిగ్నల్స్ లేకుండా రోడ్డుపై నిలిపిన డీసీఎం డ్రైవర్ రాంనరేష్‌పై కేసు నమోదు చేశామని డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ప్రమాద సమయంలో కారు కూడా స్పీడ్‌గా ఉందని, కారులో ఉన్న వారిలో నలుగురు మృతి చెందగా, మరో నలుగురు గాయపడ్డారని.. ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో వారిని హైదరాబాద్‌లోని యశోదకు తరలించినట్లు తెలిపారు.

సర్దుబాటా.. నియామకమా?

బడులు తెరుచుకొని మూణ్నెళ్లయినా నిర్ణయం తీసుకోని ప్రభుత్వం

- నాలుగేళ్లుగా విద్యావలంటీర్లను నియమించని వైనం
- ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- జిల్లావ్యాప్తంగా 643 పోస్టులు ఖాళీ



జిల్లా పరిధిలో ఇలా..	మొత్తం ప్రభుత్వ పాఠశాలలు : 845	చదువుకుంటున్న విద్యార్థులు : 60,200	మంజూరైనా ఉపాధ్యాయ పోస్టులు : 3,742
	ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులు : 3,108		ఖాళీగా ఉన్న పోస్టులు : 634

అచ్చంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో ప్రభుత్వం ఏటా విద్యావలంటీర్లను నియమించేది. ఇందుకు గాను గౌరవ వేతనం చెల్లించేది. ఫలితంగా విద్యార్థులు తరగతులు నష్టపోకుండా ఉండడంతోపాటు నిరుద్యోగులకు ఉపాధి లభించేది. అయితే ఈ విద్యా సంవత్సరం పాఠశాలలు తెరిచే నాటికి విద్యావలంటీర్లను నియమించాలని జనవరిలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధ్యాయుల ఖాళీల స్థానంలో విద్యావలంటీర్లు వస్తారని భావించారు. కానీ, బడులు తెరిచి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడంతో పాఠశాలల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తారా.. లేక విద్యా వలంటీర్లను నియమిస్తారా అనేది తేలడం లేదు. ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం. తక్కువ మంది విద్యార్థులు ఉన్నచోట ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉంటే వారిని మరోచోటికి పంపించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందులో వంద పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను ఇతర పాఠశాలల్లో సర్దుబాటు చేసేందుకు కలెక్టర్‌కు నివేదిక సమర్పించినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు త్వరలోనే వెల్లువడే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ సజావుగా జరిగేతే ఖాళీలు ఉన్నచోట విద్యా వలంటీర్లను నియమించే అవకాశం ఉంది.

465 పోస్టులు ఖాళీ..

ఈ ఏడాది జూన్ 6 నుంచి 19 వరకు ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమం మొక్కుబడిగా నిర్వహించారు. మారుమూల గ్రామాలు, చెంచుపెంటల్లో విద్యార్థుల పెంపు నామమాత్రంగా కొనసాగింది. జిల్లాలోని 845 ప్రభుత్వ పాఠశాలల్లో 60,200 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో 180 ఏకోపాధ్యాయ బడులున్నాయి. 1 నుంచి 10 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలు 90 వరకు ఉన్నాయి. 60 పాఠశాలల్లో ఒక్క విద్యార్థి పేరు కూడా నమోదు కాలేదని విద్యా శాఖ నివేదికలు చెబుతున్నాయి. జిల్లాలో 3,743 ఉపాధ్యాయ పోస్టులకు గాను ప్రస్తుతం 3,108 మంది ఉన్నారు. ఇటీవల చేపట్టిన బదిలీలు, పదోన్నతుల ఫలితంగా 634 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. అయితే బదిలీ అయిన చోట కొత్త ఉపాధ్యాయులు రాకపోవడంతో పాతవారే కొనసాగుతున్నారు. జిల్లాలో 231 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం ఈ నెల 5న డీఎస్సీ పరీక్షలు నిర్వహించింది. ఫలితాలు వెలువడిన తర్వాత నియామకాల ప్రక్రియ చేపట్టాలి. ఈ తతంగం జరిగేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉంది. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం విద్యా వలంటీర్ల నియామకం చేపట్టాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

నివేదిక అందజేశాం..



తక్కువ మంది విద్యార్థులు ఉండి.. ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల నుంచి ఇతర చోట్లకు సర్దుబాటు చేసేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్‌కు నివేదిక అందజేశాం. ఈ మేరకు జిల్లాలోని వంద పాఠశాలల్లో మార్పులు, చేర్పులు జరుగుతాయి. దీని తర్వాత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తే విద్యా వలంటీర్ల నియామకం చేపడుతాం. ఇప్పటికైతే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– గోవిందరాజులు, జిల్లా విద్యాధికారి

క్లుప్తంగా

నీటి ట్యాంకర్ మీద పడి వ్యక్తి మృతి


హన్మంత్ నాయక్ (ఫైల్)

బల్మూర్: గ్రామ పంచాయతీకి చెందిన వాటర్ ట్యాంకర్ మీద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. అంబగిరి గ్రామానికి చెందిన మూడావత్ హన్మంత్ నాయక్(34) గ్రామస్తులతో కలిసి వన భోజనాలకు వెళ్లాడు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌తో తాగునీటిని తీసుకవెళ్లారు. ట్రాక్టర్ ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న హన్మంత్‌నాయక్‌పై పడడంతో తీవ్రగాయాలు కాగా, అచ్చంపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య తిరుపతమ్మ, నలుగురు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ రైతు..

గట్టు: మండలంలోని చాగదోన గ్రామానికి చెందిన రైతు మునిస్వామి (35) గురువారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్థానికుల వివరాల మేరకు.. బుధవారం సాయంత్రం తన వ్యవసాయ పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతు చేస్తుండగా.. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని కర్నూలు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్య

మాగనూర్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ పి.అశోక్‌బాబు వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కొత్తపల్లికి చెందిన తిమ్మవ్వ(55) కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. అనారోగ్య బాధలు తట్టుకోలేక ఆమె ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగిపడిపోయింది. ఆ సమయంలో ఇంటికి వచ్చిన కుమారుడు బంగి ఆనంద్ చూసి ఆమెను చికిత్స కోసం మక్తల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డేంజర్ రోడ్

జాతీయ రహదారి–44పై పెరుగుతున్న భారీ ప్రమాదాలు


భూత్పూర్ మండలం అన్నాసాగర్ సమీపంలో ప్రమాదానికి గురైన కారు

- నిలిపి ఉన్న వాహనాల వల్లే ఎక్కువ సంఘటనలు
- కట్టడి చేయడంలో విఫలమవుతున్న అధికార యంత్రాంగం
- నెల రోజుల వ్యవధిలో రెండు భారీ సంఘటనలు


ప్రమాదానికి కారణమైన డీసీఎం

మహబూబ్‌నగర్ క్రైం: జాతీయ రహదారి–44పై మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు నిత్యకృత్యమయ్యాయి. వీటి కట్టడికి పోలీసులు, రవాణా శాఖ అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం నామమాత్రంగా ఉంటోంది. ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో జిల్లాలో చాలా వరకు జాతీయ రహదారిపైనే జరుగుతున్నాయి. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా రహదారిపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు సంబంధిత అధికారులు ప్రయత్నిస్తున్నారు. అయితే నెల రోజుల వ్యవధిలో రెండు భారీ ప్రమాదాలు జరగడంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు.

అయోమయానికి గురై..

జాతీయ రహదారితోపాటు అంతర్రాష్ట్ర రోడ్లపై రాత్రి సమయాల్లో సరిగా వెలుగులు ఉండవు. కనీసం గ్రామాల సమీపంలోనూ విద్యుత్ లైట్ల వెలుగులు కనిపించడం లేదు. దీంతో అయోమయానికి గురవుతున్న వాహనదారులు మలుపుల వద్ద రోడ్డు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు. కొందరు యువకులు మద్యం తాగి వాహనాలు నడపడం కూడా ఒకింత కారణమవుతోంది. నిబంధనల ప్రకారం రోడ్ల వెంట ఉండే గ్రామాల పొడవునా సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి. సర్వీస్ రోడ్డు వెంట భారీ లైట్లను బిగించాలి. కానీ, ఉమ్మడి జిల్లా పరిధిలో ఒకట్రెండు చోట్ల మినహా ఎక్కడా ఇవీ కనిపించడం లేదు. ప్రమాదకర స్థలాలను గుర్తించి జాగ్రత్తలను సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలి. ఆయా స్థలాల్లో స్థానిక పోలీస్‌స్టేషన్, ఆస్పత్రుల వివరాలు రాయాలి. రోడ్ల వెంట ఎక్కడ మద్యం తాగే అడ్డాలను లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ముఖ్యంగా జాతీయ రహదారిపై రోడ్డు మధ్యలో ఉండే డివైడర్‌పై కంచె ఏర్పాటు చేయాలి. ఈ నిబంధనలు జిల్లాలోని రహదారి వెంట ఎక్కడా కనిపించవు.

నిబంధనలకు తూట్లు

ఉమ్మడి జిల్లాలోని ఏ ఒక్క రహదారిపై కూడా నిబంధనలు అమలుకావడం లేదు. రోడ్ల వెంట ఉండే దాబాల ముందు లెక్కకు మించి భారీ వాహనాలు, కార్లు, ద్విచక్ర వాహనాలను నిలుపుతున్నారు. అక్కడే వాహనాలకు మరమ్మతు, పంక్చర్లు చేసుకోవడమే కాకుండా భోజనం కూడా వండుకుంటున్నారు. దీంతో రోడ్డుపై వెళ్లేవారికి ఇబ్బందులు తలెత్తి ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. రోడ్ల వెంట 24 గంటలు వాహనంలో తిరుగుతూ పర్యవేక్షించాల్సిన (హైవే పెట్రోలింగ్) అధికారులు, సిబ్బంది సక్రమంగా కనిపించడం లేదు. దీంతో రోడ్లపై వాహనదారులు వారికి సంబంధించిన భారీ వాహనాలను రోడ్లపై ఇష్టారాజ్యంగా నిలుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు.

నివారణ చర్యలు శూన్యం

జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాలకు ఆర్టీఏ, పోలీస్, ఆర్‌అండ్‌బీ, ఎల్‌ఎన్‌టీ వారు ఎవరు కూడా సరైన చర్యలు తీసుకోవడం లేదు. కేవలం రోడ్డు ప్రమాదాల వారోత్సవాలు జరిగినప్పుడు మాత్రమే తూతూమంత్రంగా కార్యక్రమాలు నిర్వహిస్తారు. తర్వాత వాటిని పట్టించుకునే నాథుడే లేకుండాపోతున్నారు. జాతీయ రహదారిపై ఎక్కడ కూడా అవసరమైన ప్రమాద సూచికలు లేకపోవడంతో రాత్రి 7 నుంచి తెల్లవారుజామున 5 గంటల మధ్య ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. జాతీయ రహదారిపై మలుపులు ఉన్న దగ్గర రేడియేషన్ కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది.

ప్రమాదాలు ఇలా..

ఏడాది	రోడ్డు ప్రమాదాలు	మరణాలు
2022	222	233
2023	230	243
2024	113	121

అతివేగమే కారణం


ప్రమాద సమయంలో కారు స్పీడ్ 120 - 140 మధ్యలో చూపిస్తున్న రీడింగ్ మీటర్

ప్రమాద ఘటనలు జరిగిన తీరు చూస్తుంటే ఒళ్లు గగుర్పొడిచే రీతిలో ఉంటున్నాయి. ప్రమాద స్థలంలో ముక్కలైన శరీర అవయవాలు బయటకు వస్తున్నాయి. గురువారం పోల్కంపల్లి దగ్గర జరిగిన కారు ప్రమాదంలో డ్రైవర్ మృతదేహం బయటకు తీయడానికి దాదాపు రెండు గంటల పాటు శ్రమించాల్సి వచ్చింది. కారు పూర్తిగా ధ్వంసం కావడం చూస్తే వాహనం స్పీడ్ ఎంత ఉందో ఊహించుకోవచ్చు. ప్రస్తుతం మార్కెట్‌లోకి వేగం ఎక్కువగా ఉన్న వాహనాలు వస్తున్నాయి. వాహనం స్టార్ట్ చేసిన 5 సెకన్లలోపు వేగం అందుకుంటుంది. ఈ సమయంలో ఏదైనా అడ్డుగా వస్తే వాహనాన్ని నియంత్రించలేక ప్రమాదానికి గురవుతున్నారు.

నిందితుడికి రిమాండ్

వనపర్తి రూరల్: చోరీ కేసులో పట్టుబడిన నిందితుడిని గురువారం రిమాండ్‌కు తరలించినట్లు శ్రీరంగాపురం ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. శ్రీరంగాపురం మండలం నాగరాలకు చెందిన గుంటి శివకుమార్ ఇంట్లో ఈనెల 26న అదే గ్రామానికి చెందిన కావలి గురుప్రసాద్ చోరీకి పాల్పడ్డాడు. అతడి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం మత్తులో గొంతుకోసుకున్నాడు..

వేములవాడ: మహబూబ్‌నగర్ నుంచి వేములవాడకు ఉపాధి కోసం వచ్చిన ఖాజా అనే యువకుడు తాగిన మైకంలో గురువారం తన గొంతు కోసుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని కట్టకింది బస్టాండులో ఈ అఘాయిత్యానికి పాల్పడగా.. స్థానికులు 108 వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.

సైబర్ క్రైం కేసులో ఆరుగురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్, పక్కన ఏఎస్పీ రాందాస్ తేజావత్

- 250 మందితో రూ.20 లక్షలు కాజేసిన ముఠా రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని టార్గెట్ చేసి 250 మందితో సుమారు రూ.20 లక్షలు కాజేసిన ముఠాను రిమాండ్ చేసినట్లు ఎస్పీ రావుల గిరిధర్ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి గురువారం సాయంత్రం ఆయన ఏఎస్పీ రాందాస్ తేజావత్, డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సైబర్ క్రైం డీఎస్పీ రత్నం, కొత్తకోట సీఐ రాంబాబులతో కలిసి వివరాలను వెల్లడించారు. కొత్తకోటకు చెందిన కొత్త కుమ్మరి రాజు ముద్ర రుణం కోసం జనవరిలో దరఖాస్తు చేసుకోగా.. 2024 జూలై 11న కొందరు ఒక వాట్సాప్ నంబర్ నుంచి లోన్ మంజూరు కోసం డబ్బులు పంపించాలని మెసేజ్ చేయగా.. రూ.12,250, టాక్సీ చెల్లించాలని మరోసారి మేసేజ్ చేయగా.. రూ.9 వేలు పంపించాడు. తీరా బ్యాంకు వద్దకు వెళ్లి అధికారులను కలిసి లోన్ విషయం ఆరా తీయగా మోసపోయినట్లు తెలుసుకుని కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా.. ఈ సైబర్ నేరం చేసిన ముఠాలో మొత్తం ఎనిమిది మంది ఉండగా.. వారిలో ఇద్దరు మైనర్లు ఉన్నట్లు గుర్తించారు. పెద్దమందడి మండలం జంగమాయపల్లికి చెందిన కురుమూర్తి అనే వ్యక్తిని మొదట అదుపులోకి తీసుకుని విచారించగా.. నర్సింగ్‌నాయక్ సూత్రధారి అని వనపర్తి పట్టణంలో ఓ గది అద్దెకు తీసుకుని నివాసం ఉంటూ.. రాత్లావత్ రమేష్, ఇస్లావత్ రాములు, కొత్తపల్లి ఉమేష్, బోయ వీరేష్‌లతోపాటు మరో ఇద్దరు మైనర్లను ముఠాగా చేసుకుని బీహార్‌కు చెందిన రోహిత్ సాయంతో ముద్ర, ధని రుణాల కోసం దరఖాస్తు చేస్తున్న వారి వివరాలను అనధికారికంగా సేకరించి నిర్మానుష్యమైన ప్రాంతానికి వెళ్లి మేసేజ్‌లు చేసి సైబర్ క్రైంకు పాల్పడినట్లు వెల్లడించారు. అందరిని అదుపులోకి తీసుకుని వారితో 26 మొబైల్ ఫోన్లు, 22 సిమ్ కార్డులు, 5 మోటార్ సైకిళ్లు, రూ.85 వేల నగదు మొత్తం రూ.10 లక్షల విలువైన సామగ్రిని జప్తు చేసినట్లు వెల్లడించారు. కీలకమైన ఈ సైబర్ కేసును ఛేదించిన ఎస్‌ఐలు, సైబర్ క్రైం విభాగం అధికారులను ఎస్పీ అభినందించారు.

ఆదివాసీ చెంచుల అభ్యున్నతికి పాటుపడాలి


మాట్లాడుతున్న ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, చిత్రంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

- ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్

మన్ననూర్: ఆదివాసీ చెంచుల అభ్యున్నతికి సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర గిరిజన ఆర్థిక సహకార సంస్థ చైర్మన్ బెల్లయ్య నాయక్ అన్నారు. మన్ననూర్ ఐటీడీఏ కార్యాలయంలో గురువారం నాగర్‌కర్నూల్ ఎంపీ డా. మల్లు రవి, ఎమ్మెల్యే డా. వంశీకృష్ణతో కలిసి ఐటీడీఏ, గిరిజన అభివృద్ధి సంక్షేమశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ నుంచి చెంచులకు అందుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. చెంచులు, గిరిజనుల ఆర్థికాభివృద్ధికి చేయూత అందించేందుకు బ్యాంకుల నుంచి విరివిగా రుణాలు మంజూరు చేయాలన్నారు. ఆదివాసీ చెంచుల కోసం ఎంఎస్‌ఎంఈ ద్వారా మంజూరైన నాలుగు యూనిట్లలో మూడు యూనిట్లను ఇప్పటి వరకు సద్వినియోగం చేసుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల అభ్యున్నతికి కృతనిశ్చయంతో పనిచేస్తుందన్నారు. నిరుద్యోగ యువతకు అటవీశాఖ, ఐటీడీఏ తరపున ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సూచించారు. మారుమూల గ్రామాలు, పెంటలలో రహదారులు, మంచినీటి సౌకర్యంతో పాటు చెంచు కుటుంబాలలోని పిల్లలకు మెరుగైన విద్య, వైద్యం అందించేందుకు కృషి చేయాలన్నారు. కాగా, ఐటీడీఏ పరిధిలోని చెంచు కుటుంబాల అభివృద్ధి, సంక్షేమానికి ప్రతి ఏటా 500 యూనిట్లు కేటాయించాలని జిల్లా చెంచు సేవాసంఘం ఆధ్వర్యంలో చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో ఐటీడీఏ అధికారి రోహిత్‌రెడ్డి, డీటీడీఓ ఫిరంగి, ఐటీడీఏ ఏఓ జాఫర్ హుస్సేన్, ఐకేపీ ఏపీఓ లక్ష్మయ్య, జీసీసీ మేనేజర్ సంతోష్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ సృజన్ కుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్ రవూఫ్, ఏపీడీఓ లక్ష్మీనారాయణ, రాజేంద్ర ప్రసాద్, శంకరయ్య, శ్రీనివాసులు, ప్రవీణ్‌కుమార్, పెద్దిరాజు ఉన్నారు.

చెంచులకు కార్పొరేట్ వైద్యం

కొల్లాపూర్ రూరల్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెంచులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో కార్పొరేట్ వైద్యం అందిస్తామని బెల్లయ్యనాయక్ అన్నారు. మండలంలోని అమరగిరి చెంచుగూడేన్ని ఆయన ఎంపీ మల్లురవితో కలిసి సందర్శించారు. ప్రభుత్వం ఇటీవల చెంచులకు మంజూరు చేసిన ఫిషరీస్ సెంటర్‌ను పరిశీలించారు. అక్కడ చెంచులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ చెంచుల సమస్యలన్నీ తమ ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం

జడ్చర్ల: స్థానిక ఎర్రగుట్ట కాలనీలో నివాసం ఉంటున్న తల్లి, ఇద్దరు పిల్లలు అదృశ్యమైన సంఘటన చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ నాగేశ్వర్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఎర్రగుట్టలో నివాసం ఉంటున్న ముద్దంగుల వెంకటేశ్ బుధవారం యథావిధిగా ఇంటి నుంచి పని నిమిత్తం బయటకు వెళ్లాడు. పనులు పూర్తి చేసుకుని సాయంత్రం ఇంటికొచ్చే సరికి ఇంట్లో భార్య జ్యోతి(31) పిల్లలు సంజయ్(8), హిందు(7)లు కనిపించలేదు. చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

కోయిల్‌సాగర్ నీటిమట్టం 24 అడుగులు

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం గురువారం సాయంత్రం వరకు 24 అడుగులకు చేరింది. మరో 2.6 అడుగుల నీరు చేరితే అలుగు స్థాయికి చేరుకుంటుంది. ప్రస్తుతం జూరాల నుంచి ఎత్తిపోతల పథకం ద్వార కోయిల్‌సాగర్‌కు నీటిని పంపింగ్ చేస్తున్నారు. జూలై చివరి వారం నుంచి కుడి, ఎడమ కాల్వల ద్వారా కోయిల్‌సాగర్ ఆయకట్టు భూములను నీటిని వదిలి వారం రోజుల క్రితం నిలిపివేశారు. నీటిప్రవాహం ఎక్కువగా ఉండంతో ప్రస్తుతం మళ్లీ సాగునీటిని విడుదల చేస్తున్నారు.

మళ్లీ.. మార్కెట్ కమిటీ లొల్లి

గద్వాల మార్కెట్‌యార్డు నూతన పాలకవర్గంపై వీడని సందిగ్ధం



గద్వాల వ్యవసాయ మార్కెట్‌యార్డు

- తాము సిఫారసు చేసిన వారికే పట్టం కట్టాలని రెండు వర్గాల పట్టు
- ఏఐసీసీ అధినేత మల్లికార్జున్ ఖర్గే వద్దకు పంచాయితీ
- 2 నెలల క్రితమే జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత వర్గం పేర్ల ప్రతిపాదన
- తాజాగా ఎమ్మెల్యే బండ్ల పంపిన వర్గం పేర్లను సిఫారసు చేసిన మంత్రి జూపల్లి
- ఏ వర్గానికి కమిటీ దక్కుతుందో?

గద్వాల: గద్వాల మార్కెట్ కమిటీ లొల్లి మళ్లీ మొదటికొచ్చింది. అటు ఎమ్మెల్యే.. ఇటు జెడ్పీ మాజీ చైర్ పర్సన్ ఇద్దరూ తమ వారికే పదవులు దక్కాలని పట్టుబట్టడంతో ఈ వ్యవహారం పార్టీ పెద్దలకు కత్తి మీద సాములా మారింది. వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన పాలక వర్గం ఏర్పాటు చేసేందుకు రెండు నెలల క్రితమే జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత తన అనుచరుల పేర్లను సిఫారసు చేస్తూ ప్రభుత్వానికి పంపారు. అదే సమయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం ఎమ్మెల్యే తన వర్గం పేర్లను ప్రతిపాదించగా.. వాటిని ఉమ్మడి జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు సంబంధిత వ్యవసాయశాఖకు సిఫారసు లేఖ పంపారు. దీంతో సరిత సిఫారసు చేస్తూ పంపిన పేర్లు సంబంధిత శాఖ మంత్రి పెండింగ్‌లో పెట్టారని సమాచారం. మొత్తంగా రెండు నెలలుగా స్తబ్దుగా ఉన్న పాలకవర్గం ఏర్పాటు లొల్లి మళ్లీ తెరమీదకు వచ్చింది. ఇదిలా ఉండగా, సరిత వర్గం ఈ పంచాయితీని ఏకంగా ఏఐసీసీ మల్లికార్జున్ ఖర్గే వద్దకు తీసుకువెళ్లడం, సీఎంఓ స్థాయిలో ఆరా తీయడంతో గద్వాలలో మరోసారి ఆధిపత్య పోరు తెరపైకి వచ్చింది.

సరిత వర్గం పేర్లు పెండింగ్..


కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల్లో భాగంగా బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్న సరిత సిఫారసు చేసిన పనులకే అధిక ప్రాధాన్యత లభిస్తూ వస్తున్న క్రమంలో బండ్ల చేరికతో దీనికి బ్రేకులు పడ్డాయి. ఓ వైపు పార్టీ ఇన్‌చార్జ్, మరోవైపు ఎమ్మెల్యే ఒకే పార్టీలో ఉంటూ రెండు గ్రూపులుగా మారి ఎవరికి వారు ఆధిపత్యం కోసం పోటీపడుతూ వస్తున్నారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆశీస్సులు, సరిత వర్గానికి ఎంపీ మల్లురవి ఆశీస్సులు ఉన్నాయనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఆధిపత్యం కారణంగా రెండు నెలల క్రితం పార్టీ ఇన్‌చార్జ్ సరిత పంపిన పేర్లు సంబంధిత వ్యవసాయ శాఖ మంత్రి వద్ద పెండింగ్‌లో ఉన్నాయి.


ఎమ్మెల్యే తన వర్గం పేర్ల ప్రతిపాదన

గద్వాల వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీకి సంబంధించి నూతన పాలక మండలి ఏర్పాటు కోసం తాజాగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తన వర్గానికి చెందిన కేటీదొడ్డి మండలం కుర్వ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని చైర్మన్‌గా, గద్వాల పట్టణానికి చెందిన మున్నూరుకాపు వర్గానికి చెందిన వ్యక్తిని వైస్ చైర్మన్‌గా ప్రతిపాదనలు పంపారు. ఎమ్మెల్యే వర్గం పంపిన పేర్లను సిఫారసు చేస్తూ మంత్రి జూపల్లి కృష్ణారావు సంబంధిత వ్యవసాయశాఖ కమిషనర్‌కు లేఖ పంపడం ప్రాధాన్యత సంతరించుకొంది.

పార్టీ అధినేతల వద్దకు పంచాయితీ

ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు ఇప్పటికే రాష్ట్ర పార్టీ పెద్దలకు తలనొప్పిగా మారగా, తాజాగా అది ఏఐసీసీ అధినేత మల్లికార్జున్ ఖర్గే వద్దకు చేరినట్లు సమాచారం. మార్కెట్‌యార్డు నూతన పాలక వర్గం ఏర్పాటుపై తమకు తీరని అన్యాయం జరుగుతుందంటూ సరిత వర్గం ఆయన వద్ద వాపోయినట్లు తెలిసింది. దీనిపై రాష్ట్రపార్టీ పెద్దలు, ప్రభుత్వ పెద్దలతో ఆరా తీసినట్లు సమాచారం. ఈ విషయం ఖర్గే వరకు ఎలా వెళ్లింది, ఎవరు తీసుకెళ్లారనే దానిపై రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు తలలు పట్టుకుంటున్నారు.


ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పంపిన పేర్లు


ఎమ్మెల్యే పంపిన పేర్లను ఆమోదించాలని మంత్రి జూపల్లి పంపిన లేఖ

అభయ 'హస్తం' ఎవరికి..?

గద్వాలలో ఉప్పు, నిప్పుగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే బండ్ల, పార్టీ ఇన్‌చార్జ్ సరిత వర్గాలు.. ఇటీవలి మంత్రి జూపల్లి కృష్ణారావుకు కూడా ప్రత్యక్షంగా తమ ఆధిపత్యాన్ని చూపెట్టారు. ఇటీవల జిల్లాలో రిజర్వాయర్ల పరిశీలనకు మంత్రి రాగా.. ఒక వర్గం వారు ఆయనను అడ్డుకొని నిరసన తెలపడం, వాహనంపై రాళ్లు రువ్వడం, చివరికి పోలీసు కేసులు సైతం నమోదయ్యాయి. ఈనేపథ్యంలో గద్వాల వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ రెండు వర్గాలలో ఏ వర్గానికి దక్కుతుందోనని ఉత్కంఠ నెలకొంది.

ప్రథమ చికిత్స కేంద్రం సీజ్

- జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి



వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణానికి చెందిన విజయ్, విజయలక్ష్మిల కుమారుడు యశ్వంత్ (8) తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో చికిత్స నిమిత్తం స్థానిక పీఎంపీ ప్రథమ చికిత్స కేంద్రానికి తరలించారు. వైద్యం వికటించి బుధవారం బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం పలు పత్రికల్లో రావడంతో స్పందించిన జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు పెబ్బేరు మండల కేంద్రంలోని సాయిరాం ప్రథమ చికిత్స కేంద్రాన్ని తనిఖీ చేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పీఎంపీలు, ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, స్థాయికి మించి చికిత్స చేయరాని సూచించారు. ఈ సంఘటనపై విచారణ చేసి చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంట్లో చోరీ

- బంగారు, వెండి నగలు, నగదు అపహరణ

జడ్చర్ల: ఇంటిక తాళం వేసి తల్లిగారింటికి వెళ్లిన సమయంలో ఇంట్లో దొంగలు పడి బంగారు, వెండి, నగదు అపహరించిన ఘటన గురువారం పట్టణంలో టీచర్స్ కాలనీలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శివానందం గౌడ్ కథనం మేరకు.. స్థానిక టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న స్టాఫ్ నర్సు నాగలక్ష్మి ఈనెల 26న ఇంటికి తాళం వేసి స్థానిక పాతబజార్‌లో నివాసం ఉంటున్న తల్లి దగ్గరకు వెళ్లింది. బుధవారం ఇంటికి తిరిగి వచ్చే సరికి ఇంటికి వేసిన తాళం విరగ్గొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న పుస్తెలతాడు, ఒక జత బుట్టాలు, కమ్మలు, మాటీలు, నల్లపూసల దండ, వెండి, నగదు కనిపించలేదు. మొత్తం ఐదు తులాల బంగారు నగలతో పాటు, 12 తులాల వెండి వస్తువులు, రూ.95వేల నగదు ఎత్తుకెళ్లారు. గురువారం బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెరువులను రక్షించుకుందాం


సమావేశంలో మాట్లాడుతున్న సత్తయ్య

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని చెరువులు, కుంటలను రక్షించుకుందామని గురువారం పట్టణంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు నిర్ణయించారు. జలవనరులను రక్షించుకుందామని తెలుగు సత్తయ్య అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి వార్డు కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, ఉమాశంకర్‌గౌడ్, సామాజికవేత్తలు అనిల్‌కుమార్, యాదగిరి, చాంద్‌ఖాన్, నాయకులు కృష్ణయాదవ్, శ్రీనివాస్, రమేష్‌నాయక్, కృష్ణయ్య, లోకేష్‌నాయక్, శ్రీనివాసులు, వెంకటేష్ మరికొందరు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మున్సిపాలిటిలో ఆరు చెరువులు, కుంటలు ఉండాలని, అవన్ని 90శాతం ఆక్రమణలకు గురైనందున పరిరక్షణ కోసం పోరాడుదామని పిలుపునిచ్చారు. నల్లకుంటలో అక్రమ నిర్మాణాలు చేస్తున్నందున వాటిని అడ్డుకోవాల్సిన అవసరం ఉందని, భవిష్యత్‌లో నీటి ఎద్దడిరాకుండా ఉండాలంటే చెరువులు, కుంటలు కాపాడుకోవాలన్నారు. హైడ్రా తరహాలో మున్సిపాలిటీ పరిధిలో చెరువులు, కుంటలు కాపాడేందుకు కమిటీ వేయాలని, మున్సిపల్ పాలకవర్గం దీనిపై స్పందించాలన్నారు. మొదట తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించి ఆందోళనలు ప్రారంభిద్దామని సమావేశంలో తీర్మానించారు. పోరాటానికి ఎమ్మెల్యే సహకారం తీసుకోవాలని, అప్పుడైతే అధికారుల చిత్తశుద్ధితో పనిచేసే ఆస్కారం ఉందన్నారు.

పొలాల్లో సోలార్ ప్లాంట్లు

- రైతులు 4 వేల మెగావాట్ల ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి
- పీఎం–కుసుం పథకం కింద కేంద్రం గ్రీన్‌సిగ్నల్
- ఉత్పత్తి అయిన విద్యుత్‌ను తప్పనిసరిగా కొనుగోలు చేయనున్న డిస్కంలు
- యూనిట్ విద్యుత్‌కు రూ.3.13 చెల్లించనున్న విద్యుత్ సంస్థలు



సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి కిసాన్ ఊర్జా సురక్షా ఏవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎం–కుసుమ్) పథకం కింద రైతులు/రైతు సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రంలో 4 వేల మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల అనుమతిచ్చింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ పథకంలో చేరేందుకు ఆసక్తి ప్రదర్శించలేదు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విజ్ఞప్తి చేయడంతో కేంద్రం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. అన్ని రాష్ట్రాలకు కలిపి ఇప్పటివరకు 8,112 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల స్థాపనకు కేంద్రం అనుమతి ఇవ్వగా, అందులో అత్యధికంగా 4 వేల మెగావాట్ల ప్లాంట్లు రాష్ట్రా నికి సంబంధించినవే కావడం గమనార్హం. రైతులు వ్యక్తిగ తంగా లేదా ఇతరులతో కలిసి తమ పొలాల్లో 0.5 మెగా వాట్లు నుంచి 2 మెగావాట్ల సామర్థ్యం కలిగిన చిన్న సోలా ర్ పవర్ ప్లాంట్లను పెట్టుకోవడానికి అవకాశం కల్పిస్తారు. రెన్యువబుల్ పర్చేజ్ ఆబ్లిగేషన్ (ఆర్పీఓ) నిబంధనల ప్రకారం రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు ఏటా తప్పనిసరిగా కొంత శాతం పునరుత్పాదక విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీంతో ఈ ప్లాంట్‌ల ద్వా రా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను కూడా ఆర్పీఓ నిబంధనల కింద డిస్కంలు తప్పనిసరిగా రైతుల నుంచి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. యూనిట్ విద్యుత్‌కు రూ.3.13 చొప్పున రైతులకు డిస్కంలు చెల్లించనున్నాయి. రైతుల నుంచి కొనుగోలు చేసే ప్రతి యూనిట్ విద్యుత్‌కు 0.40 పైసలు చొప్పున ఐదేళ్ల పాటు డిస్కంలకు కేంద్ర పునరు త్పాదక ఇంధన శాఖ ప్రోత్సాహకంగా అందించనుంది.

పెట్టుబడిలో 30% రైతుల వాటా

రైతులు స్వయంగా తమ స్థలాల్లో ప్లాంట్ పెట్టుకోవచ్చు. లేకుంటే సహకార సంఘాలు/పంచాయతీలు/రైతుల గ్రూపులు/నీటి వినియోగ సంఘాలతో కలిసి ఏర్పాటు చేయవచ్చు. ఆర్థిక స్తోమత లేకుంటే డెవలపర్లకు తమ స్థలాలను లీజుకు ఇచ్చి ప్లాంట్ పెట్టించవచ్చు. మెగావాట్ సౌర విద్యుత్ ప్లాంట్ ద్వారా ఏటా సగటున 16 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కానుండగా, రైతులు/డెవలపర్లకు రూ.50.08 లక్షల ఆదాయం రానుంది. అయితే సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు వ్యయం మెగావాట్‌కు రూ.4 కోట్ల నుంచి రూ.4.5 కోట్ల వరకు కానుంది. ఇందులో రైతులు 30 శాతం పెట్టుబడి పెడితే మిగిలిన 70 శాతం మూలధనాన్ని బ్యాంకులు రుణంగా ఇచ్చే అవకాశం ఉంటుంది. 10–12 ఏళ్లలో రైతుల పెట్టుబడి మొత్తం తిరిగి వచ్చే అవకాశం ఉందని తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (రెడ్కో) జనరల్ మేనేజర్ జీఎస్‌వీ ప్రసాద్ 'సాక్షి'కి తెలిపారు.

త్వరలో ఆసక్తి వ్యక్తీకరణకు ఆహ్వానం..

డిస్కంలు తమ 33/11 కేవీ, 66/11 కేవీ, 110/11 కేవీ సబ్ స్టేషన్ల వారీగా వాటి పరిధిలో ఎంత సామర్థ్యం మేరకు సోలార్ పవర్ ప్లాంట్లు పెట్టేందుకు అవకాశం ఉందో గుర్తించి తమ వెబ్‌సైట్‌లో ప్రకటించాల్సి ఉంటుంది. ఇప్పటికే రాష్ట్రంలో ఈ ప్రక్రియ పూర్తైంది. త్వరలో రైతుల నుంచి ఆసక్తి వ్యక్తీకరణను ఆహ్వానిస్తూ డిస్కంలు ప్రకటన జారీ చేయనున్నాయి. ఆసక్తి గల రైతులు/డెవలపర్లు మెగావాట్‌కు రూ.,5000కి మించకుండా ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. రైతులు/డెవలపర్లు కుదుర్చుకునే విద్యుత్ కొనుగోలు ఒప్పందం ఆధారంగా రైతులు/డెవలపర్లకు బ్యాంకులు రుణం ఇవ్వనున్నాయి.



కొలనుపాకలోని సోమేశ్వరాలయంలో శిలాశాసనాన్ని పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతోంది

- ఓబుల్‌కేశ్వాపూర్ గ్రామస్తుల ఐకమత్యం బాగుంది
- జనగామ, భువనగిరి జిల్లాల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన
- అవార్డు గ్రహీతలను కలిసిన గవర్నర్

జనగామ, సాక్షి యాదాద్రి: తెలంగాణ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశంసించారు. ఇక్కడకు గవర్నర్‌గా వచ్చిన తర్వాత మొట్టమొదటిసారిగా ఓ మారుమూల గ్రామానికి రావడం సంతోషాన్ని కలిగించిందని అన్నారు. గురువారం జనగామ, భువనగిరి జిల్లాల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటించారు. రెండు జిల్లాల కలెక్టర్ కార్యాలయాల్లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ రంగాల ప్రముఖులు, కవులు, కళాకారులు, రచయితలతో భేటీ అయ్యారు. జనగామ మండలం ఓబుల్‌కేశ్వాపూర్ గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో స్వామి వారి కల్యాణంలో పాల్గొని వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్న తర్వాత ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రజలు చాలామంచి వ్యక్తులని, అందులో ఓబుల్‌కేశ్వాపూర్ గ్రామస్తుల ఐకమత్యం సంతోషం కలిగించిందన్నారు. ఊరిలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం కొద్దిరోజుల్లో టూరిస్టు సెంటర్‌గా మారబోతుందని చెప్పారు. అంతకుముందు జనగామ జియోగ్రాఫికల్ వివరాలను పవర్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ గవర్నర్‌కు వివరించారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్‌సింగ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక, సాహిత్యంలో యాదాద్రి టాప్..
సాంస్కృతిక, సాహిత్య, ఆధ్యాత్మిక రంగాల్లో యాదాద్రి భువనగిరి జిల్లా ఎంతో ప్రసిద్ధి చెందిందని గవర్నర్ అన్నారు. వివిధ రంగాలలో అవార్డు గ్రహీతలను ఆయన అభినందించారు. స్వాతంత్య్ర సమరయోధులు మన్నె గోపాలరెడ్డి, కూరెళ్ల విఠలాచార్య, కేతావత్ సోమ్లానాయక్‌లను గవర్నర్ శాలువాలతో సత్కరించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గజం అంజయ్య, చింతకింది మల్లేశం, కూరెళ్ల విఠలాచార్య, కేతావత్ సోమ్లా నాయక్, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీతలు డాక్టర్ ఎన్.గోపి, నిఖిలేశ్వర్, కాళోజీ పురస్కార గ్రహీత శ్రీరామోజు హరగోపాల్, జాతీయ ఉత్తమ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, రాష్ట్ర ప్రభుత్వ యువ పురస్కార గ్రహీత తిరునగరి శ్రీనివాస్, పర్వతారోహకురాలు పడమటి అన్వితారెడ్డి, నంది అవార్డు గ్రహీత ఎం.డి.అబ్దుల్, శరత్‌చంద్ర ఛటోపాధ్యాయ జాతీయ పురస్కార గ్రహీత డాక్టర్ షేక్ అబ్దుల్ ఘని, తెలుగు విశ్వవిద్యాలయం పురస్కార గ్రహీత లింగంపల్లి రామచంద్రం తదితరులతో గవర్నర్ సమావేశమయ్యారు. అనంతరం వారితో కలిసి రాత్రి భోజనం చేశారు.

ఆలయాల సందర్శన: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు మండలం కొలనుపాక జైన దేవాలయాన్ని సందర్శించారు. అదేవిధంగా శ్రీ చండికాంబ సహిత సోమేశ్వర దేవాలయాలను సందర్శించిన గవర్నర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భువనగిరి సమీపంలోని స్వర్ణగిరి దేవాలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీఎం హోదాలో ఉండి సుప్రీం తీర్పుపై వ్యాఖ్యలా!

▶ మొదటి పేజీ తరువాయి
జరగనివ్వండి' అంటూ జస్టిస్ గవాయి ఘాటుగా వ్యాఖ్యానించారు.

పదే పదే అలాంటి వ్యాఖ్యలా?
'ఆ తరహా వ్యాఖ్యలు..మళ్లీ గురువారం ఉదయం కూడా! బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన తొలి వంద రోజుల్లోనే ఈ తరహా స్టేట్‌మెంట్లు ఇవ్వడాన్ని ఓసారి గుర్తుకు తెచ్చుకోండి. కోర్టుపై ఆక్షేపణలు చేశారు. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తి చేసే బాధ్యతాయుతమైన ప్రకటనేనా ఇది? న్యాయవ్యవస్థకు ఆమడ దూరంలో ఉండడమే కార్యనిర్వాహకుల ప్రాథమిక విధి. విమర్శించండి.. కానీ ఆక్షేపణలు వద్దు..' అని జస్టిస్ విశ్వనాథన్ స్పష్టం చేశారు.

అలాగైతే న్యాయాధికారులపై విశ్వాసం లేనట్లే అవుతుంది
'ఓటుకు నోటు కేసు విచారణ బదిలీ చేయాలన్న పిటిషన్ల విచారణకు స్వీకరిస్తే న్యాయాధి కారులపై కోర్టుకు విశ్వాసం లేనట్లే అవుతుంది. ఎన్నికల సమయంలో ఇలాంటి పిటిషన్లు దాఖలు చేస్తారు. చట్టసభల్లో జోక్యం చేసుకోబోమని చెబుతుంటాం. వారికీ ఇది వర్తిస్తుంది' అని జస్టిస్ గవాయి పేర్కొన్నారు.

దర్యాప్తు పారదర్శకంగా జరిగే అవకాశం లేదు: పిటిషనర్ల తరపు న్యాయవాది
వ్యాఖ్యల సవరణకు ప్రయత్నిస్తామని తెలంగాణ ప్రభుత్వం తరపు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయ వాది ముకుల్ రోహత్గీ తెలిపారు. అయితే జరగాల్సిన నష్టం ఇప్పటికే జరిగిపోయిందని, అటువంటి వ్యాఖ్యలు న్యాయమూర్తులపై ఒత్తిడి తీసుకురావడంతోపాటు దిగువ కోర్టులకూ వ్యాపించే అవకాశం ఉందని పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది సి.సుందరం పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ప్రస్తుతం సీఎం కావడంతో పాటు ఏసీబీని కూడా తన అధికార పరిధిలో ఉంచుకున్నారని, దర్యాప్తు పారదర్శకంగా జరిగే అవకాశం ఉండదని అన్నారు. దర్యాప్తు అధికారులు కూడా మారారని చెప్పారు. గతంలో దాఖలు చేసిన కౌంటరుకు సంబంధించి సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. పోలీసులపై కూడా రేవంత్‌రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని తెలిపారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అని, ఏ వ్యక్తీ తన సొంత విషయంలో న్యాయమూర్తి కాకూడదనే సహజ న్యాయసూత్రం గుర్తుచేశారు.

న్యాయవ్యవస్థపై విశ్వాసం ఉంచాలి

ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మా సనం.. స్వతంత్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమిస్తే దర్యాప్తుపై విశ్వాసం పెరిగే అవకాశం ఉంటుందని అభిప్రాయపడింది. గతంలో దర్యాప్తుపై స్టే ఇచ్చిన అంశం, సీబీఐకి బదిలీ తదితర అంశాలపై ఆరా తీసింది. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకంపై తెలంగాణకు చెందిన సహచరుల ను సంప్రదిస్తామని తెలిపింది. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమిస్తామని, అయితే ప్రస్తుత పిటిషన్‌ను కొట్టివేస్తామని పేర్కొంది. న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉంచాలని, అందరికీ విశ్వాసం కలిగేలా నియామకం చేపడతామని జస్టిస్ గవా యి చెప్పారు. ప్రస్తుత పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేంద్రరావుతో పాటు మరో న్యాయవాది ఉమామహేశ్వరరావు ఉత్తమమని భావిస్తున్నామన్నారు. అయితే తమకు పోలీసు అధికారుల విష యంలో ఆందోళన ఉందని పిటిషనర్ల తరపు మరో సీనియర్ న్యాయవాది శేషాద్రినాయుడు చెప్పారు. అనంతరం తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

తిరిగి ప్రజాక్షేత్రంలోకి కేసీఆర్!

▶ మొదటి పేజీ తరువాయి
జనంలోకి వెళ్లాలని పార్టీ నేతలు సూచిస్తున్నట్లు తెలిసింది.

రుణమాఫీ, రైతు బంధు వైఫల్యంపై..
రాష్ట్ర రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీరు, విద్యుత్ కష్టాలతోపాటు రుణమాఫీ జరగక పోవడం, రైతుబంధు ఇవ్వకపోవడం వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేసీఆర్ భావిస్తున్నారు. బీఆర్‌ఎస్ పాలనలో రైతు సంక్షేమం కేంద్రంగా అమలు చేసిన కార్యక్రమాలను వివరించడంతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలనే యోచనలో కేసీఆర్ ఉన్నారు. రుణమాఫీ, రైతు భరోసా అంటూ ఎన్నికల హామీలను ఉల్లంఘిస్తున్న వైనాన్ని కేసీఆర్ ఎండగట్టనున్నారు. దీని కోసం లోక్‌సభ ఎన్నికల ప్రచారం తరహాలో బస్సు యాత్ర పెట్టాలా లేక భారీ సభలు నిర్వహించాలా అనే కోణంలో పార్టీ నేతలతో చర్చిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా పార్టీ కేడర్, రైతులతో సభలు నిర్వహిస్తే ఎలా ఉంటుందనే కోణంలోనూ కసరత్తు జరుగుతోంది.

అమెరికా పర్యటనకు కేటీఆర్: కేటీ రామారావు బుధవారం రాత్రి అమెరికా పర్యటనకు వెళ్లారు. బుధవారం సాయంత్రం ఢిల్లీ నుంచి సోదరి కవితతోపాటు హైదరాబా ద్‌కు చేరుకున్న కేటీఆర్ కొద్ది గంటల వ్యవధిలోనే అమెరికాకు వెళ్లారు. తన కుమారుడు హిమాన్షుకు సంబంధించిన విద్యాపరమైన విషయాల కోసం అమెరికాకు వెళ్లి నట్లు సమాచారం. సెప్టెంబర్ రెండోవారంలో కేటీఆర్ తిరిగి హైదరాబాద్‌కు వస్తారని సమాచారం. ఇదిలా ఉంటే 'తండ్రి బాధ్య తల్లో అమెరికాకు వెళ్తున్నా' అనే అర్థం వచ్చేలా కేటీఆర్ 'ఎక్స్'లో పోస్ట్‌పెట్టారు.

ఆడబిడ్డకు ఆత్మీయ స్వాగతం

- ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కి చేరుకున్న కవిత
- ఆప్యాయంగా హత్తుకున్న కేసీఆర్

మర్కూక్/గజ్వేల్/సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో బెయిల్‌పై విడుదలైన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఫామ్‌హౌస్‌లో ఆత్మీయ స్వాగతం లభించింది. మూడు రోజుల క్రితం బెయిల్‌పై విడుదలై హైదరాబాద్‌కు చేరుకున్న కవిత గురువారం బంజారాహిల్స్‌లోని తన నివాసం నుంచి భర్త అనిల్ కుమార్, కుమారుడితో కలిసి ఎర్రవల్లికి వెళ్లారు. ఎర్రవల్లిలోని నివాసానికి చేరుకున్న కవితను ఆమె తండ్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆప్యాయంగా హత్తుకున్నారు. కేసీఆర్ పాదాలకు నమస్కరించి తండ్రి చేతిని కవిత ఆప్యాయంగా ముద్దాడారు. కేసీఆర్ పాదాలకు కవిత నమస్కరిస్తున్న సమయంలో ఎర్రవల్లి నివాసంలో ఉద్విగ్న వాతావరణం కనిపించింది. పలువురు మహిళలు కవితకు దిష్టితీసి మంగళహారతులతో స్వాగతం పలికారు. అప్పటికే ఫామ్‌హౌస్‌లో ఉన్న ఎంపీ జోగినపల్లి సంతోష్, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, మాజీ టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, మాజీ పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు కూడా కవితకు స్వాగతం పలికారు. కవిత రెండు గంటలకుపైగా ఫామ్‌హౌస్‌లో గడిపి తిరిగి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు.

నేతన్నపై నిర్లక్ష్యపు 'ముద్ర'

కాలపరిమితికి ముందే ముద్ర యోజన రుణ ఖాతాలు క్లోజ్

- సేవింగ్ ఖాతాలో ఉన్న డబ్బు అప్పు కిందకు జమ
- ఆందోళనలో చేనేత కార్మికులు



తమ ఖాతాల్లో ఉన్న మైనస్ బ్యాలన్స్ ను చూపుతున్న చేనేత కార్మికులు

రాజోళి: సాధారణంగా బ్యాంకు ద్వారా తీసుకునే రుణంతో ప్రయోజనం చేకూరాలి. కాని బ్యాంకు సిబ్బంది నిర్లక్ష్యంతో రుణగ్రస్తులకు నష్టం వాటిల్లింది. వారికి ఎలాంటి సమాచారం లేకుండా సేవింగ్ ఖాతాలో ఉన్న డబ్బును అప్పు కిందకు జమ చేసుకొని చేనేత కార్మికులను మనోవేదనకు గురిచేశారు. జిల్లాలోని రాజోళిలో అధిక శాతం చేనేత కార్మికులు ఉన్నారు. చేనేత వస్త్రాల ఉత్పత్తి కూడా ఇక్కడి నుంచి ఎక్కువగా ఉంటోంది. అలాంటి చోట పథకాల అమలుకు కూడా పెద్దపీట వేయాల్సి ఉంది. కాగా, కార్మికుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అందించిన ముద్ర యోజన రుణాలతో కార్మికులకు మేలు చేకూరినప్పటికీ.. రుణ ప్రక్రియ పూర్తిచేసిన బ్యాంకు సిబ్బంది తప్పిదాలతో ప్రస్తుతం తమకు నష్టం వాటిల్లిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

600 మందికి రుణాలు..

జిల్లాలో వేలాది చేనేత కార్మికులు ఉండగా.. రాజోళి మండలంలో 600 మందికి ముద్ర యోజన రుణాలు మంజూరయ్యాయి. అయితే రుణాల ప్రక్రియలో స్థానిక యూనియన్ బ్యాంకు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చేనేత శ్రామిక సేవాసమితి సభ్యులు అప్పటి కలెక్టర్ వల్లూరు క్రాంతి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ఆదేశాలతో ముద్ర యోజన రుణాల ప్రక్రియ వేగంగా ముందుకు కదిలింది. రుణాలు అందించేందుకు బ్యాంకర్లు చేసిన సర్వే రోజులన్నీ కూడా రుణం తీసుకున్న సమయం కిందకే నమోదు చేశారని కార్మికులు వాపోతున్నారు. దీంతో మూడేళ్ల పాటు ఉండాల్సిన రుణ పరిమితి గడువు.. 9 నెలలు ముందుగానే ముగిసిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు అధికారులు మాత్రం రుణం కోసం అకౌంట్ తెరిచిన సమయం నుంచే కాలపరిమితి లెక్కిస్తామని అంటున్నారు. కాగా, 2021 ఆగస్టులో ముద్ర రుణాల ప్రక్రియ మొదలుకాగా.. అప్పటి నుంచి 36 నెలలు లెక్కవేశారని, తాము మాత్రం రుణం తీసుకున్న రోజు నుంచి వాయిదాలు చెల్లించాలని అనుకున్నామని కార్మికులు పేర్కొంటున్నారు. మొత్తం 600 మందికి రుణాలు అందగా.. ఇప్పటికే 280 మందికి పైగా రుణం ముగిసినట్లు తెలుస్తోంది. వారి అకౌంట్లు కూడా క్లోజ్ అయ్యాయి. అయితే ఇంకా చాలా మందికి ఆగస్టు 2021లో ఇచ్చిన రుణాలతో పాటే ఇచ్చేందుకు అవకాశమున్నా.. వారి సిబిల్ స్కోర్, బ్యాంకు లావాదేవీలు సక్రమంగా లేని కారణంగా, ఇతర ధ్రువపత్రాలు సక్రమంగా లేని కారణంగా వారికి రుణాలు ఆలస్యంగా ఇచ్చారు. దీంతో వారి అకౌంట్లు క్లోజ్ కాలేదు.

ఖాతాదారుల ఆందోళన..

ముద్ర యోజన రుణం కోసం చేనేత కార్మికులు బ్యాంకులో ప్రత్యేక ఖాతా తెరిచారు. అప్పటికే ఉన్న సేవింగ్ అకౌంట్‌కు ఇది లింక్ అయ్యింది. రుణం కాలపరిమితి ముగిసిందని ఆ అకౌంట్‌ను క్లోజ్ చేయడంతో రుణం తీసుకున్న ఖాతాదారుల అకౌంట్‌లో ఉన్న డబ్బును అప్పు కిందకు జమగా వెళ్లిపోయింది. దీంతో డబ్బు ఉన్న వారికి అప్పు క్లియర్ కాగా.. ఖాతాల్లో డబ్బులు లేని వారికి మైనస్ బ్యాలన్స్ చూపుతుంది. నెలనెలా వాయిదాల పద్ధతిలో చెల్లించే తమకు ఇలా ఒకే సారి 9 నెలల నగదును తీసుకుంటే ఎలా అని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. మైనస్ బ్యాలన్స్‌లో ఉన్న వారిలో చాలా మంది పింఛన్ దారులు, రైతులు ఉన్నారు. వారికి పింఛన్ డబ్బు, పంట రుణమాఫీ ఇతర డబ్బు వస్తుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. మరికొందరు వ్యాపార లావాదేవీల కోసం పెట్టుకున్న డబ్బును అప్పులోకి మళ్లించుకోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. దీనిపై బ్యాంకర్లు మాత్రం తాము ఏం చేయలేమని.. కావాలంటే కొత్త రుణాలు ఇవ్వగలమని అంటున్నారు.

నా పింఛన్ డబ్బు రాదేమో..



నేను ముద్ర యోజన ద్వారా 2021 ఆగస్టులో రూ. 50 వేల రుణం తీసుకున్నా. కాలపరిమితి ముగిసిపోతుందని బ్యాంకర్లు తెలియపర్చలేదు. దీంతో ఇంకా సమయం ఉందనుకున్నాం. నా ఖాతాలో డబ్బు లేకపోవడంతో రూ. 18 వేలు మైనస్‌లో పడింది. నాకు వచ్చే పింఛన్ డబ్బు కూడా అదే ఖాతాలోనే పడతాయి. అవి నా చేతికి వస్తాయో రావో అని ఆందోళనగా ఉంది.
– బత్తలయ్య, చేనేత కార్మికుడు, రాజోళి

ఇది బ్యాంకు మేనేజర్ తప్పిదమే..



ముద్ర యోజన ద్వారా రూ. 50 వేల రుణం అందుతుందంటే సంతోషించి తీసుకున్నాం. కాని ఇచ్చే ముందు అప్పటి బ్యాంకు మేనేజర్ చేసిన తప్పిదం వల్ల వందలాది మంది కార్మికులకు అదనంగా భారం పడుతుంది. మా ఖాతాల్లో నుంచి 7 నెలల వాయిదాల డబ్బును ఒకేసారి జమ చేసుకుంటే మా ఇల్లు ఎలా గడుస్తుంది? బ్యాంకు మేనేజర్ సక్రమంగా వ్యవహరించి ఉంటే ప్రస్తుతంనష్టపోవాల్సిన అవసరం వచ్చేది కాదు.
– కరీం, రాజోళి

రూ. 20 వేలు ఒకేసారి మైనస్‌లోకి..



నా ఖాతాలో ఒకేసారి రూ. 20 వేలు మైనస్‌లోకి వెళ్లాయి. ముద్ర లోన్ చెల్లించేందుకు ఇంకా 36 నెలల కాలవ్యవధి ఉంది. ముందుగానే డబ్బులు కట్ కావడం వల్ల నష్టపోయాం. అసలే కష్టకాలంలో ఉన్నాం. బైక్ ఈఎంఐ, ఇంటి రుణాలు, అత్యవసర పరిస్థితుల కోసం బ్యాంక్‌లో ఉంచుకున్న నగదును కనీస సమాచారం లేకుండా రుణం కిందకు మళ్లించారు.
– నాగరాజు, చేనేత కార్మికుడు, రాజోళి

బ్యాంకు అధికారులను కలుస్తాం.

ముద్ర లోన్ తీసుకున్న కార్మికులకు మైనస్ బ్యాలన్స్‌లోకి వెళ్లిన విషయం మా దృష్టికి వచ్చింది. దీనిపై బ్యాంకు అధికారులతో చర్చించి చేనేత కార్మికులకు న్యాయం చేసే ప్రయత్నం చేస్తాం.
– గోవిందయ్య, చేనేత, జౌళిశాఖ ఏడీ, జోగుళాంబ గద్వాల

కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



శివాజీ చౌరస్తాలో కళాకారుల ప్రదర్శన

కోస్గి: దేశంలోనే తెలంగాణ రాష్ట్రం కళలకు పట్టినిల్లు వంటిదని, ప్రభుత్వాలు కళాకారులను గుర్తించి వారిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సాంస్కృతిక కళ రాష్ట్ర అధ్యక్షుడు వంగ శ్రీనివాసులు గౌడ్ అన్నారు. ఈ మేరకు గురువారం కోస్గిలో ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన ప్రపంచ జానపద కళాకారుల జాతర కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి పాలమూరు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు చెందిన పలువురు కళాకారులు, బృందాలు తమ కళా ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ముందుగా కళాకారుల ర్యాలీని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ప్రారంభించారు. స్థానిక శివాజీ చౌరస్తాలో పలు బృందాల కళా ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం ర్యాలీని స్థానిక ఏబీ ఫంక్షన్ హాల్ వరకు కొనసాగించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కళాకారులను గుర్తించి వారికి గౌరవ వేతనం అందించాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో 50 శాతం రాయితీ కల్పించడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల్లో కళాకారులను భాగస్వాములను చేస్తూ.. వారికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు రంగాల్లో కళాకారులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి రషీద్, కళాకారులు పాల్గొన్నారు.

జూరాల వద్ద కృష్ణమ్మ పరవళ్లు



జూరాల నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ దిగువ ఉన్న శ్రీశైలం వైపు పరుగెడుతుంది. మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో జూరాలకు నాలుగు రోజులుగా భారీగా ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు బుధవారం 2.44లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, గురువారం సాయంత్రానికి 2.94లక్షలకు పెరిగినట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 39 క్రస్టు గేట్లను ఎత్తి 2,66,097 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 89, కుడి కాల్వ ద్వారా 620, ఎడమ కాల్వకు 820, కోయిల్‌సాగర్‌కు 315, భీమా లిఫ్టు–2కు 750, ఆర్డీఎస్ లింకు కెనాల్‌కు 50, సమాంతర కాల్వకు 500 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 2,88,778 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు వైపు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో 8.087 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు 1,53,383 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని, ప్రాజెక్టు నుంచి 1,72,932 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 1,77,407 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 30 గేట్లను ఎత్తి 1,82,007 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

220 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి..

ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టుకు వరద పెరగడంతో దిగువ, ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి తగ్గుముఖం పట్టింది. గురువారం ఐదు యూనిట్లలలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, 120.946 మిలియన్ యూనిట్లు, దిగువలో ఇప్పటి వరకు 99.710 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని చేపట్టామన్నారు. మొత్తం 220.656 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని సాధించామని తెలిపారు. ప్రస్తుతం 14 వేల క్యూసెక్కులను వినియోగించి దిగువ శ్రీశైలంకు నీటిని వదులుతున్నారు.

సుంకేసుల గేట్లు మూసివేత..
రాజోళి: సుంకేసుల డ్యాం గేట్లను గురువారం అధికారులు మూసివేశారు. ఎగువ నుంచి 2వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రావడంతో అధికారులు గేట్లను మూసేసి, ఔట్ ఫ్లో నిలిపేశారు. కేసీ కెనాల్‌కు 2,095 క్యూసెక్కులను విడుదల చేసినట్లు జేఈ రాజు తెలిపారు.

ఉపాధి రంగాల్లో యువతకు మెరుగైన శిక్షణ



జడ్చర్లలో సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డితో కలిసి భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: రాష్ట్రవ్యాప్తంగా సెట్విన్ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి రంగాల్లో మెరుగైన శిక్షణ ఇస్తున్నట్లు సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి అన్నారు. జడ్చర్లలో సెట్విన్ శిక్షణ కేంద్రం ఏర్పాటు కోసం స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, సంస్థ ఎండీ వేణుగోపాల్‌తో కలిసి పట్టణంలో నిరుపయోగంగా ఉన్న గురుకుల భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సెట్విన్ చైర్మన్ మాట్లాడుతూ.. 1978 నుంచి రాష్ట్రంలో యువతకు శిక్షణ అందిస్తున్నామన్నారు. తమ సంస్థలో శిక్షణ పొందిన వారు దేశవ్యాప్తంగా వివిధ ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రాణిస్తున్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 23 శిక్షణ కేంద్రాలు కొనసాగుతుండగా.. జహీరాబాద్, జడ్చర్లలో కొత్తగా తమ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఏడాది దాదాపు 20 వేల మంది నిరుద్యోగ యువతకు 60 కోర్సులలో శిక్షణ అందిస్తున్నామన్నారు. ప్రధానంగా యువతకు అక్కరకు వచ్చే వృత్తులపై దృష్టి సారించినట్లు తెలిపారు. మహిళలకు బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైన్, జరీ అల్లడం వంటి ప్రాధాన్యత కోర్సులను ప్రారంభిస్తామన్నారు. అదేవిధంగా కంప్యూటర్ ఎడ్యుకేషన్, కంప్యూటర్ హార్డ్ వేర్, ఎయిర్ లైన్ టికెటింగ్, సెల్‌ఫోన్ రిపేర్, స్పోకెన్ ఇంగ్లిష్, ప్రింటింగ్ ప్రెస్, సీసీ కెమెరాల మరమ్మతుతో పాటు ఏసీ, వాషింగ్ మిషన్, ఆర్ఓ మిషన్స్, కటింగ్ అండ్ టైలరింగ్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. తమకు భవనాన్ని స్వాధీనం చేస్తే, అక్టోబర్‌లో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ.. పోలేపల్లి సెజ్‌లో గల పరిశ్రమలలో అక్కరకు వచ్చే విధంగా ఆయా కోర్సుల్లో శిక్షణ ఇవ్వాలని కోరారు. కాగా, ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతిచెందిన గోప్లాపూర్ హరిశ్చంద్రా నాయక్ కుటుంబానికి విద్యుత్‌శాఖ తరఫున రూ. 5 లక్షల చెక్కు అందజేశారు. అదేవిధంగా పశువులు కోల్పోయిన పెద్దపల్లికి చెందిన శేఖర్, కంచన్‌పల్లికి చెందిన ఖలీల్‌కు రూ. 40 వేల చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ జయశేఖర్, ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ నిత్యానందం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, మాజీ సర్పంచ్ వెంకటేశం పాల్గొన్నారు.